

పీఎంకేలో

పదవుల చిచ్చు!

తండ్రీకొడుకుల మధ్య విభేదాలు

- పీఎంకే యువజన విభాగం అధ్యక్షుడిగా రాందాస్ మనవడు
- మేనల్లుడి ఎంపికన తప్పుబట్టిన అన్బుమణి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాందాస్. పక్కనే ముభావంగా అన్బుమణి

చెన్నై, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాట్టాలిమక్కల్ కట్చి (పీఎంకే)లో పదవుల పందేరం చిచ్చురేపింది. ఆ పార్టీ అధినేత డాక్టర్ రాందాస్, పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి మధ్య తీవ్ర విభేదాలకు కారణమైంది. రాందాస్ మనవడు (కుమార్తె కొడుకు)ను పార్టీ యువజన విభాగాధ్యక్షుడిగా ప్రకటించడమే ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. శనివారం పుదుచ్చేరిలో జరిగిన పీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలోనే ఇది జరగడంతో నేతలు, కార్యకర్తలు నివ్వెరపోయారు. ముకుందన్ పరశురామన్‌ను పార్టీ యువజన విభాగాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు సమావేశానికి అధ్యక్షత వహించిన రాందాస్ ప్రకటించారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన పార్టీ అధ్యక్షుడు అన్బుమణి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముకుందన్ పార్టీలో చేరి కొన్ని నెలలే అవుతుండగా అతడికి పార్టీలో కీలకమైన పదవి ఇవ్వాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. పార్టీని స్థాపించింది తానేనని, పార్టీలో ఎవరు ఏ పదవిలో ఉండాలో, ఎవరిని తొలగించాలన్నది దానిపై తనదే తుది నిర్ణయమని రాందాస్ ప్రకటించారు. దీంతో సమావేశం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. రాందాస్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 50 సీట్లయినా గెలుచుకోవాలంటే పార్టీలో యువ బలం అవసరమని, అందువల్ల అన్బుమణికి సాయంగా ఉండేందుకే తాను యువజన విభాగం అధ్యక్షుడిగా ముకుందన్ పరశురామన్‌ను నియమించినట్లు వివరించారు. ఆయన పక్కనే వున్న అన్బుమణి జోక్యం చేసుకుంటూ.. 'నాకు సహాయంగానా? అయితే వద్దే వద్దు' అంటూ కేకలేశారు. దీనిపై రాందాస్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'నీకు అవసరం లేకుంటే వదిలేయ్, ఈ పార్టీని ప్రారంభించింది నేను. నా మాటకు తిరుగులేదు, అందరూ నా మాటకు కట్టుబడాల్సిందే. ఇందులో ఎలాంటి మార్పు లేదు' అని తెగేసి చెప్పారు. అంతేగాక పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండేందుకు పనయూరులో ప్రత్యేకంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించానని, ఏదైనా అవసరమైతే కార్యకర్తలు తనను నేరుగా కలుసుకోవచ్చన్నారు. నిత్యం అందుబాటులో ఉండేలా తన మొబైల్ నెంబరును కూడా ప్రకటించారు.

2026లో సంకీర్ణ ప్రభుత్వమే...

రాబోవు శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పడుతుందని, ఏ కూటమిలో చేరాలనే విషయమై తాను తగిన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటానని రాందాస్ ప్రకటించారు. పార్టీని ప్రారంభించి 35 యేళ్లవుతున్నా అధికారంలోకి రాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎంకే అధికారంలోకి వచ్చివుంటే వన్నియార్ల రిజర్వేషన్ కోసం రాష్ట్ర స్థాయి ఆందోళన జరపాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. 2026 ఎన్నికల్లో సంకీర్ణ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, ఈ విషయంలో ఏ మాత్రం సందేహానికి తావు లేదన్నారు.

ఇంతకీ ఎవరీ ముకుందన్?

పీఎంకే అధినేత రాందాస్, పార్టీ అధ్యక్షుడైన ఆయన కుమారుడు అన్బుమణి మధ్య వివాదానికి కారణమైన ముకుందన్ ఎవరన్నది చర్చనీయాంశమైంది. ఆయన స్వయానా రాందాస్ మనవడే. రాందాస్ కుమార్తె కాంతిమది-పరశురామన్ దంపతులు కుమారుడు. అంటే అన్బుమణికి స్వయానా మేనల్లుడు. మేనల్లుడి ప్రవేశంతో వారసత్వ పోరు జరిగే అవకాశముందన్న అనుమానంతో అన్బుమణి వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది.

పొంగల్ పోటీలు

400 ప్రాంతాల్లో జల్లికట్టు

పెరంబూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగను పురస్కరించుకొని, 18 జిల్లాల్లోని 400 ప్రాంతాల్లో జల్లికట్టు పోటీలు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక పథక అధికారి నవనీత్‌కృష్ణన్ తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లోని 400లకు పైగా ప్రాంతాల్లో ఎద్దులు వదిలే పోటీలు, ఎద్దులు అదుపుచేసే సహా నాలుగు రకాల జల్లికట్టు పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఆ ప్రకారం, మదురై, విరుదునగర్, తేని, కరూర్, దిండుగల్, తిరుచ్చి, పుదుకోట, శివగంగ, నామక్కల్, తంజావూరు, తిరువారూరు, అరియలూరు తదితర జిల్లాల్లో జల్లికట్టు పోటీలు జరుగుతాయన్నారు. ధర్మపురి, కృష్ణగిరి, వేలూరు, రాణిపేట, తిరుప్పూర్, శివగంగ, పుదుకోట జిల్లాల్లో ఎద్దులు వదిలే పోటీలు, మంజువీరట్టు, వడమాడు తదితర పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీలు జనవరి నుంచి మే వరకు జరుగుతాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, పోలీసు, అగ్నిమాపక, ప్రజాపనులు, ఆరోగ్య, పశుసంవర్ధక శాఖల పర్యవేక్షణలో పోటీలు జరుగనున్నాయన్నారు. జల్లికట్టు పోటీల మార్గదర్శకాలు తెలుసుకొనేందుకు, కొత్తగా జల్లికట్టు పోటీలు జరిపేందుకు ఆసక్తి ఉన్న వారు www.jallikattu.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ముందుగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.





జల్లికట్టు పోటీలకు సిద్ధమవుతున్న ఎద్దులు

అన్నావర్సిటీకి గవర్నర్

- విద్యార్థులు, రిజిస్ట్రార్, అధ్యాపకులతో భేటీ
- అత్యాచార ఘటనపై ఆరా


అన్నా వర్సిటీలో రిజిస్ట్రార్, సీనియర్ ప్రొఫెసర్లతో చర్చిస్తున్న గవర్నర్ రవి



చెన్నై, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించి విశ్వవిద్యాలయాల చాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి విచారణ జరిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఆయన విశ్వవిద్యాలయానికి వెళ్లి అక్కడ అదనపు పోలీసు భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పరిశీలించారు. విద్యార్థులు, విద్యార్థినులకు మరింత భద్రత కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి రిజిస్ట్రార్, అధ్యాపకులు, సిబ్బందితో చర్చలు జరిపారు. యూనివర్సిటీ మీటింగ్‌హాలులో రిజిస్ట్రార్, సీనియర్ ప్రొఫెసర్లతో గవర్నర్ భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం విద్యార్థులు, విద్యార్థినులతో వేర్వేరుగా మాట్లాడారు. విద్యార్థులు తెలిపిన భద్రతా ఏర్పాట్లలో స్వల్ప లోపాలను వీలయినంత త్వరగా సరిచేస్తామని గవర్నర్ వారికి భరోసా ఇచ్చారు. అత్యాచార ఘటనపై ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మరింత పటిష్ఠంగా విద్యార్థులకు భద్రత కల్పిస్తున్నామని, ఈ విషయమై తాను విశ్వవిద్యాలయ పాలకులు ఖచ్చితమైన ఆదేశాలిచ్చానని గవర్నర్ రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.





సభకు హాజరైన విద్వాంసులు, సంగీత కళాకారులు - అవార్డు గ్రహీతలతో ఆనందరావు పాటిల్, ఊరా లక్ష్మీనరసింహారావు

విశ్వకళా సంగమ సేవలు అభినందనీయం

- కేంద్రప్రభుత్వ అదనపు కార్యదర్శి ఆనందరావు పాటిల్

ప్యారీస్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): హిందుస్థానీ సంగీత విశిష్టతను ప్రపంచ దేశాలకు విస్తరింపజేయాలన్న సంకల్పంతో స్థాపించిన 'విశ్వకళా సంగమ' సేవలు ప్రశంసనీయమని కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఆనందరావు పాటిల్ పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో స్థాపించిన విశ్వకళా సంగమ 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా మూడురోజుల వార్షిక సంగీతోత్సవాలు ఆళ్వార్‌పేటలోని ట్యాగ్‌సెంటర్‌లో ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజైన శనివారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆనందరావు పాటిల్, గౌరవ అతిథిగా ఐఐటీ మద్రాసు డైరెక్టర్ వి.కామకోటి పాల్గొన్నారు.ఈసందర్భంగా విశ్వకళా పురస్కారాలను ప్రముఖ భరతనాట్య కళాకారిణి పద్మశ్రీ చిత్రా విశ్వేశ్వరన్, ప్రముఖ తబలా విద్వాంసులు తేజేంద్ర మజుందార్, సంగీత విద్వాంసులు శశాంక్ సుబ్రహ్మణ్యంలకు అందజేసి ఘనంగా సత్కరించారు. ఆనందరావు మాట్లాడుతూ.. సంగీతం అనేది యూనివర్సల్ లాంగ్వేజ్ అని, సంగీతం వినడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. సితార పండిట్ జనార్దన్ మిట్టా, ఊరా గ్రూప్ సంస్థల అధినేత ఊరా లక్ష్మీనరసింహారావు 2000వ సంవత్సరంలో ప్రారంభించిన విశ్వకళా సంగమ సేవలు ప్రశంసనీయమని ఈ సంస్థ యువ కళాకారులను ప్రోత్సహిస్తూ వస్తుందని కొనియాడారు.కామకోటి మాట్లాడుతూ.. ఐఐటీ మద్రాస్‌లో శాస్త్రీయ సంగీత కళలకు సంబంధించిన కోర్సులను అందిస్తున్నట్లు తెలుపుతూ, విద్యార్థులు సంగీతం బాగా నేర్చుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ముందుగా టీటీడీ చెన్నై ఆలయ వేదపండితులు కళాకారులకు వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందించి జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన తబలా విద్వాంసులు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్‌కు నివాళులర్పించారు.


శనివారం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకున్న నాబార్డ్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్ ఆనంద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.సంతానం

తిరువణ్ణామలైలో ఘోరం

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి బలవన్మరణం

మృతులు చెన్నై వాసులుగా గుర్తింపు

'దేవుణ్ణి వెతుక్కుంటూ వెళ్తున్నా'మంటూ సూసైడ్ నోట్


మృతులు (ఫైల్ ఫొటోలు)


మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు

వేలూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరిప్రదక్షిణ మార్గంలోని విడిదిగృహంలో ఓ కుటుంబం బలవన్మరణానికి పాల్పడింది. ఓ మహిళ, ఇద్దరు బిడ్డలు, మరో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడగా, వారంతా దేవుణ్ణి వెతుక్కుంటూ వెళ్తున్నట్లుగా సూసైడ్ నోట్ రాసివుండడం స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది. వివరాలిలా వున్నాయి... తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయాన్ని ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు దర్శించుకుంటారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు గిరి ప్రదక్షిణ మార్గం సమీపంలోని విడిదిగృహాల్లో బసచేస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఇక్కడి సూర్యలింగం సమీంలోని విడిదిగృహంలో నలుగురు గది అద్దెకు తీసుకున్నారు. శనివారం ఉదయం ఎంతసేపటికీ గది నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో అనుమానించిన సిబ్బంది తలుపుతట్టారు. ఫలితం లేకపోవడంతో కిటికీ నుంచి లోనికి చూడగా నలుగురూ అచేతనంగా పడి ఉండడం కనిపించింది. దీంతో తిరువణ్ణామలై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లగా అప్పటికే వారంతా విగతజీవులై వున్నారు. పక్కనే సైనెడ్ బాటిల్ ఉండడంతో వారు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ వ్యవహారంపై ఏడీఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో బృందం చేపట్టిన విచారణలో.. మృతులు చెన్నై వ్యాసర్పాడికి చెందిన రుక్మిణి (45), ఆమె కుమార్తె జలంధర (17), కుమారుడు ముకుంద ఆకాష్‌కుమార్ (15), అదే ప్రాంతానికి చెందిన శ్రీమహాకాలా వ్యాసర్ (40) అని తేలింది. వారు ఆన్‌లైన్‌లో గది బుక్ చేసుకొని శుక్రవారం సాయంత్రం వచ్చినట్లు తెలిసింది. కాగా వారు ఆత్మహత్య చేసుకున్న గదిలో వారు రాసినట్లుగా భావిస్తున్న సూసైడ్ నోట్ లభించింది. తాము ఆధ్యాత్మికంలో ఐక్యమైపోయామని, దేవుడిని వెతుక్కుంటూ వెళ్తున్నామని ఉంది. ఈ ఘటనపై తిరువణ్ణామలై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

'కెప్టెన్' ఆలయంలో ఘనంగా గురుపూజోత్సవం

- నివాళులర్పించిన రాజకీయ నేతలు
- పోలీసుల అనుమతి లేకున్నా ప్రశాంతంగా మౌన ర్యాలీ




విజయకాంత్ సమాధి వద్ద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రేమలత, ఆమె కుటుంబ సభ్యులు - రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజయకాంత్ స్మారకస్థలం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ సినీ నటుడు, డీఎండీకే వ్యవస్థాపక అధ్యక్షుడు 'కెప్టెన్' విజయకాంత్ ప్రథమ వర్ధంతి సందర్భంగా కోయంబేడులోని పార్టీ కార్యాలయంలో శనివారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి డీఎండీకే కార్యాలయం వరకు పార్టీ అధ్యక్షురాలు ప్రేమలత నాయకత్వంలో వేలాది మంది కార్యకర్తలు మౌనర్యాలీ నిర్వహించారు. ఈ నివాళి కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ నేత అన్నామలై, నటుడు విజయ్ తదితర ప్రముఖులను విజయకాంత్ కుటుంబ సభ్యులు ఆహ్వానించారు. అదే సమయంలో గురుపూజోత్సవానికి డీఎండీకే నాయకులు, ప్రముఖులు పార్టీ కార్యాలయం వద్ద భారీ ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుండి పార్టీ కార్యాలయం వరకూ ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా పార్టీ పతాకాలను, పోస్టర్లను అతికించారు. ఇక ఈ నివాళి కార్యక్రమం సందర్భంగా డీఎండీకే నేతలు మౌనర్యాలీ నిర్వహించేందుకు పోలీసుల అనుమతి కోరుతూ ఈ నెల 5న వినతిపత్రం సమర్పించారు. అయితే పోలీసులు ఆ ర్యాలీకి అనుమతి నిరాకరిస్తూ శుక్రవారం సాయంత్రం డీఎండీకే నేతలకు సమాధానం ఇచ్చారు. దీంతో పార్టీ డిప్యూటీ కార్యదర్శి ఎల్కే. సుదీష్, తదితర ప్రముఖులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు త్వరగా రిప్లై ఇచ్చి ఉంటే ర్యాలీకి కోర్టు ద్వారా అనుమతిని పొంది ఉండేవారమని, ప్రభుత్వం ఆ అవకాశమే లేకుండా చేసిందన్నారు. ఉదయం ఏడు గంటలకే మౌనర్యాలీ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులంతా అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద గుమికూడారు. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎల్కే. సుదీష్, విజయ ప్రభాకరన్, నటుడు షణ్ముగపాండ్యన్, పార్థసారథి తదితర ప్రముఖులు ఆ ప్రాంతానికి వెళ్లి మౌనర్యాలీని ప్రారంభించారు. అప్పటికే ఆ ప్రాంతం వద్ద పోలీసులు మొహరించారు. ర్యాలీ కోసం కార్యకర్తలు గుమికూడటం వల్ల ఆ మార్గంలో నడిచే సిటీ బస్సులను, వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. ఆ తర్వాత మౌన ర్యాలీ ప్రశాంతంగా ముగిసింది మౌనర్యాలీ తర్వాత ప్రేమలత, ఆమె కుటుంబీకులు విజయకాంత్ సమాధిని ఆనుకుని కొత్తగా ఏర్పాటు చేసిన చిన్న విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత వివిధ రాజకీయపార్టీల నేతలు విజయకాంత్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, బీజేపీ రాష్ట అధ్యక్షుడు అన్నామలై, తెలంగాణా మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, అన్నాడీఎంకే తరపున సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి డి.జయకుమార్, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, నామ్ తమిళర్‌కట్చి నేత సీమాన్, నటుడు ఎంఎస్ భాస్కర్ కెప్టెన్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పీకే శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ పోలీసుల అనుమతి లేకున్నా మౌన ర్యాలీ ప్రశాంతంగా ముగియడం హర్షణీయమన్నారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ మాట్లాడుతూ డీఎంకే పాలకులు స్వార్థంతోనే మౌన ర్యాలీకి అనుమతిని జారీ చేయలేదని ఆరోపించారు.


కోయంబేడు అంబేడ్కర్ విగ్రహం కూడలి నుండి డీఎండీకే కార్యాలయం వరకు నిర్వహించిన మౌన ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

సమాచార ధ్వని

వైమానికదళంలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారత వైమానికదళంలో హెల్త్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. కేరళ రాష్ట్రం ఎర్నాకుళం, పీటీ ఉష రోడ్డు మహారాజా కళాశాల ఆడిటోరియంలో జరుగనున్న ఈ ఎంపిక శిబిరంలో, తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన వారు పాల్గొనవచ్చు. హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు జనవరి 29వ తేది ఎంపిక జరుగనుండగా, ప్లస్ టూ, డిప్లొమో, బీఎస్సీ ఫార్మశీ కోర్సులు పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చు. అలాగే, ఫార్మాసిస్ట్ పోస్టులకు ఫిబ్రవరి 4వ తేది ఎంపిక జరుగనుండగా, డిప్లొమో, బీఎస్సీ ఫార్మశీ పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చు.

31న పనిచేయనున్న వండలూరు జూ

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్ ఈ నెల 31న యధావిధిగా పనిచేయనుంది. వారాంతపు నిర్వహణ కోసం ప్రతి మంగళవారం జూ మూసివేస్తుంటారు. ఈ నేపథ్యంలో, విద్యాసంస్థలకు క్రిస్మస్, న్యూ ఇయర్ సెలవులు ఇవ్వడంతో, ఈ నెల 31వ తేది (మంగళవారం) పార్క్ యధావిధిగా పనిచేస్తుందని పార్క్ అధికారులు తెలిపారు.

విమానాశ్రయాల్లో ఉద్యోగాలపై శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజన వర్గాల యువకులకు థాడ్కో ఆధ్వర్యంలో విమానాశ్రయాల్లో ఉద్యోగావకాశాల కోసం శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయమై థాడ్కో డైరెక్టర్ కందస్వామి విడుదల చేసిన ప్రకటనలో... అంతర్జాతీయ విమానయాన సంస్థ గుర్తింపు పొందిన విమాన సంస్థల సహకారంతో, విమానాశ్రయాల్లో ప్రయాణికుల సేవలు, కార్గో విభాగం, విమాన టిక్కెట్ల ముందస్తు రిజర్వేషన్ తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్లస్ టూ ఉత్తీర్ణులై, 18 నుంచి 23 ఏళ్లలోపున్న యువకులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. ఆరు నెలలు శిక్షణ కాలంలో అభ్యర్థులు హాస్టల్, శిక్షణ కోసం వసూలుచేసే రూ.95,000 ఫీజును థాడ్కో భరిస్తుంది. మరిన్ని వివరాలకు www.tahdco.com అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

'సీఎం ఫార్మశీ' ఏర్పాటుకు 856 దరఖాస్తులు

పెరంబూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జెనరిక్ మందులు విక్రయించేలా 1,000 'సీఎం ఫార్మశీ'లు ఏర్పాటుచేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మందుల దుకాణాల్లో మందులు, వైద్య ఉపకరణాలు, సిద్ధ, ఆయుర్వేద, యునానీ సహా పలురకాల మందులు విక్రయించనున్నారు.ఆసక్తికలిగినవారు https://mudhalvarmarundhagam.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఇప్పటివరకు 856 దరఖాస్తులు అందగా, మందుల నియంత్రణ శాఖ పరిశీలనకు పంపామని, అర్హులైన వారు జనవరి నుంచి ఈ దుకాణాలు ప్రారంభించేలా అనుమతులు జారీచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

'ఆన్‌లైన్' పట్టా మార్పిడికి అంతరాయం

పెరంబూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'ఆన్‌లైన్' పట్టా మార్పిడి సేవలు నాలుగు రోజులు నిలిపివేస్తున్నట్లు ల్యాండ్ సర్వే, ల్యాండ్ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో... రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ, ఆన్‌లైన్‌లో పట్టా మార్పిడి చేస్తోంది. 'తమిళ్‌నిలం' అనే యాప్‌లో రైతుల వివరాలు నమోదుచేసి రిజిస్టర్‌కు సంబంధించిన సేవలు పొందవచ్చు. ఇందుకుగాను https://tam-ilnilam.tn. gov.in/Revenue/, https://eservices.tn.gov.in/eservicesnew/index.ht-ml అనే వెబ్‌సైట్ సేవలు శనివారం నుంచి ఈ నెల 31వ తేది సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రేపటి నుంచి సర్టిఫికెట్ల పంపిణి

పెరంబూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య ఉపాధ్యాయుల సర్టిఫికెట్ పరీక్ష రాసిన అభ్యర్థులకు ఈ నెల 30వ తేది నుంచి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో నిర్వహించిన మొదటి, రెండో సంవత్సరం ప్రాథమిక విద్య ఉపాధ్యాయుల ధృవీకరణ పరీక్ష రాసిన విద్యార్థులు, ప్రైవేటు అభ్యర్థుల మార్కులు, సర్టిఫికెట్లు సోమవారం నుంచి పంపిణి చేయనున్నారు. శిక్షణ పొందిన వారు తాము శిక్షణ పొందిన సంస్థలు, ప్రైవేటు అభ్యర్థులు సంబంధిత జిల్లా కలెక్టర్, విద్య, శిక్షణ సంస్థ నుంచి పొందవచ్చని అధికారులు తెలిపారు.

రూ.500 కోట్లతో సహకార శాఖ షాపింగ్ మాల్

పెరంబూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలో సహకార శాఖకు చెందిన స్థలంలో, రూ.500 కోట్లతో షాపింగ్ మాల్ నిర్మించి, అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు. సహకార శాఖ ఆధ్వర్యంలో సంఘాలు, రేషన్ దుకాణాలు, సూపర్ మార్కెట్లు, మందుల దుకాణాలు నిర్వహిస్తున్నారు. ప్రతి జిల్లాల్లో సహకార శాఖకు స్థలాలున్నాయి. అవి ఆక్రమణకు గురికాకుండా, కల్యాణ మండపాలు నిర్మించి అద్దెకు ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయి. ఆ ప్రకారం, మైలాపూర్‌లో సహకార కల్యాణ మండపం ఇటీవల అందుబాటులోకి వచ్చింది. అలాగే, వడపళనిలో సహకార శాఖ సుమారు 2 ఎకరాల స్థలం ఉండగా, రూ.500 కోట్లతో షాపింగ్ మాల్ నిర్మించి అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకోసం 'నబార్డ్' నుంచి రుణసహాయం పొందే చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

పుదుకోటలో అరుదైన శిలాజాలు





టి.నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లాలో పలుచోట్ల శిలాజాలు బయల్పడుతుండటంతో వాటిని సంరక్షించడానికి చర్యలు చేపట్టాలని వాటి పరిశోధకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పుదుకోట జిల్లా తిరుమయం తాలూకా సెంగీరై యూకలిప్టస్ అడవిలో నీటి వాగులో రాతివృక్షం (శిలాజం) పడి ఉండటాన్ని మిరట్టునిలై ప్రభుత్వ మహోన్నత పాఠశాల సైన్స్‌టీచర్ ఎం.జీవిత నేతృత్వంలో విద్యార్థుల బృందం నవంబర్‌లో గుర్తించి. ఆ శిలా వృక్షాన్ని తిరుచ్చి నేషనల్ కాలేజీ జియాలజీ విభాగం అధ్యక్షుడు ఎస్. జవహర్‌రాజ్, ప్రొఫెసర్ ఆర్ విజయన్ తదితరులు పరిశీలించారు. దీనిపై గురించి ఎస్.జవహర్‌రాజ్ మాట్లాడుతూ సెంగీరై అడవిలో వాగు మధ్య శిలాజానికి చెందిన కొంత భాగం మాత్రమే బయల్పడింది. ప్రధానమైన రెండు భాగాలు భూమిలోపలే పూడుకుపోయాయని, వాటి పొడవు ఏమేరకు ఉందో తెలియటం లేదని చెప్పారు. ఈ శిలాజం 'కడలూరు శాండ్ స్టోన్' అనే బండరాయిలో విలీనమై ఉందని చెప్పారు. ఆ బండరాయి 2.58 కోట్ల నుండి 15.99 కోట్ల యేళ్ల క్రితం నాటిదై ఉండవచ్చని తెలిపారు. ఇంతకు ముందుకు కూడా ఈ జిల్లాలోని నరిమేడు ప్రాంతంలో రెండు చోట్ల చిన్న సైజు శిలాజాలు కనుగొన్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని విల్లుపురం జిల్లా తిరువక్కరై, పెరంబలూరు జిల్లా సాత్తనూరు, రాజస్థాన్ రాష్ట్రం జైసల్మేర్ జిల్లాలోని అకల్ గ్రామం తదిత ప్రాంతాలలో ఈ శిలాజాలను కనుగొని, వాటిని సంరక్షిస్తున్నారని ఆయన వివరించారు. ఆ రీతిలోనే పుదుకోట జిల్లాలో వరుసగా శిలాజాలు బయల్పడుతున్నాయని, వీటిని సంరక్షించడంతోపాటు వేరే ఎక్కడైనా ఇలాంటివి ఉన్నాయా అని కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు.

శిలాజాలు ఎలా తయారవుతాయి?

ఈ విషయమై పరిశోధకులు తెలిపిన వివరాల ప్రకారం భూకంపాలు ఏర్పడినప్పుడు, వరదల్లో కొట్టుకుపోతున్నప్పుడు బురదమన్నులో చెట్లు పూడుకుపోయినప్పుడు వాటిలో ఆక్సిజన్ సరఫరా ఆగిపోతుంది. దీంతో పూడుకుపోయిన చెట్ల ముక్కలు గట్టిపడతాయి. అంతే కాకుండా ఆ చెట్లగుండా వెళ్లే నీరు వాటి కణజాలాన్ని నాశనం చేస్తుంది. ఆ తర్వాత చెట్టు లోపలఖనిజాల(సిలికా)తోనిండి ఉంటుంది. ఇది ఎన్నో మిలియన్ల తర్వాతే శిలాజంగా మారుతుంది. ఈ వృక్షం వ్యాసం, వార్షిక వలయాలను అధ్యయనంచేయడం ద్వారా, ఆ చెట్టు సజీవంగా ఉన్న సమయంలో దాని ఎత్తు, ఉత్పత్తి సామర్థ్యం, పర్యావరణం, వాతావరణ పరిణామం మొదలైన విషయాలు గురించి మనం తెలుసుకోగలుగుతామని చెప్పారు. ఈ కారణాల వల్లే శిలాజాలు గత కాలపు సమాచారాలను అందించే జ్ఞాననిధిగా భావిస్తారని తెలిపారు. ప్రస్తుతం పుదుకోటలో బయల్పడిన శిలాజాలను సంరక్షించి భద్రపరిచే దిశగా ప్రభుత్వ అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

మహిళలకు ఉచిత వృత్తివిద్యా శిక్షణ

● మైలాపూర్ ఎమ్మెల్యే వేలు



అడయార్ డాక్టర్ ఎంజీఆర్ జానకి మహిళా కళాశాలలో రోటరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేలు

ప్యారీస్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్‌లోని డాక్టర్ ఎంజీఆర్ జానకి మహిళా కళాశాలలో తమిళనాడు ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శనివారం మైలాపూర్ ఎమ్మెల్యే టి.వేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన 200 మంది మహిళలకు రూ.20 లక్షల విలువైన కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. రోటరీ ఇంటర్నేషనల్ 32,34 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్ఎస్.శరవణన్, ఆక్సస్ హెల్త్ కర్ చైర్మెన్ మహేందర్ జైన్, కళాశాల చైర్మెన్, రోటరీ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ కుమార్ రాజేంద్రన్, సెల్వకృష్ణన్, రాజేష్‌మణి, ఎస్.రవి, సుజాత పంజు, సంజయ్‌రావు, కమల తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేలు మాట్లాడుతూ.. ఈ కళాశాలలో ప్రారంభించిన రోటరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మహిళలకు మూడు నెలల పాటు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ పొందవచ్చని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచిత కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు.

'పోలీస్ హెల్ప్' యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

● విద్యార్థినులకు మంత్రి చెళియన్ సూచన

ప్యారీస్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థినులు పోలీసుశాఖ పరిచయం చేసిన పోలీస్ హెల్ప్ యాప్‌ను సద్వినియోగం చేసేకోవాలని ఉన్నవిద్యా శాఖా మంత్రి కేవీ. చెళియన్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన సచివాలయ ప్రాంగణంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించిందని, అబలలు ప్రమాదంలో చిక్కుకోకుండా ముందుగానే అప్రమత్తం చేసేలా పరిచయం చేసిన పోలీస్ హెల్ప్ యాప్‌ను అన్ని విద్యాసంస్థలు, మహిళలు డౌన్‌లోడ్ చేసేకోవాలని మంత్రి సూచించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న రకరకాల దాడులకు సంబంధించిన నేరస్థులను ఫిర్యాదు అందజేసిన వెంటనే అరెస్ట్ చేసేలా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా బాలికలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుకోని ఆపదలో చిక్కుకున్నట్లైతే వెంటనే పోలీస్ హెల్ప్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో 'రెడ్ ఎమర్జెన్సీ' బటన్ నొక్కడం ద్వారా మీ ప్రస్తుత లోకేషన్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అందుతుంది. తద్వారా మహిళలపై దాడులను, ప్రమాదాలను నివారించవచ్చునని మంత్రి అన్నారు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో ఉచితంగా అందుబాటులో ఉంటుందని మంత్రి తెలిపారు.

'ఇండియన్ డాన్స్ ఫెస్టివల్' ఆరు రోజులు రద్దు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో నిర్వహిస్తున్న 'ఇండియన్ డాన్స్ ఫెస్టివల్' ఆరు రోజులు రద్దు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు, జనవరి నెలల్లో మహాబలిపురంలో డాన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తుంటారు. మహాబలిపురం సముద్రపు ఆలయ ప్రాంగణంలో నెల ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహించే ఈ ఫెస్టివల్‌లో భరత నాట్యం, కూచిపూడి, కథాకళి, సహా సంప్రదాయ కళారూపాలు వంటి పలురకాల గ్రామీణ ప్రదర్శనలున్నాయి. ఈ నెల 22 నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శనలు జనవరి 20వ తేది వరకు జరుగనున్నాయి. ఈ క్రమంలో, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా శుక్రవారం నుంచి జనవరి 1వ తేది వరకు ప్రదర్శనలు నిలిపివేస్తున్నట్లు, 1వ తేది నుంచి 20వ తేది వరకు యధాప్రకారం ప్రదర్శనలు ఉంటాయని అధికారులు తెలిపారు.

నేడు 'శ్రీపాద కథలు.. గోదావరి గలగలలు'

చెన్నై, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 156వ ప్రసంగం ఆదివారం జరుగనుంది. టినగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు విజయవాడకు చెందిన విశ్రాంత ఆంగ్లోపన్యాసకులు బొడ్డపాటి చంద్రశేఖర్ 'శ్రీపాద కథలు.. గోదావరి గలగలలు' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కందనూరు మధు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

పొంగల్ గిఫ్ట్ ప్యాక్ ప్రకటించిన ప్రభుత్వం

పెరంబూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా అందించనున్న గిఫ్ట్ ప్యాక్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో, పేద వర్గాలు కూడా పొంగల్ పండుగ ఆనందంగా జరుపుకొనేలా ప్రతి ఏడాది బియ్యం కార్డుదారులకు వస్తువులు, చెరకు గడతో కూడిన గిఫ్ట్ ప్యాక్ ప్రభుత్వం అందజేస్తోంది. ఈ నేపథ్యంలో పొంగల్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,20,94,585 బియ్యం కార్డుదారులకు తలా కిలో పచ్చి బియ్యం, కిలో చక్కెర, ఒక చెరుకు గడ అందించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.249.76 కోట్లు కేటాయించింది. ఈ గిఫ్ట్ ప్యాక్‌తో పాటు ఉచితంగా దోవతి, చీర కూడా రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాగా, పొంగల్ సందర్భంగా అందించే నగదుపై త్వరలో ముఖ్యమంత్రి ప్రకటించనున్నట్లు సచివాలయ వర్గాల సమాచారం.

నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేయాలి

● మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం

తిరుత్తణి, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ ప్రభుశంకర్ స్పష్టం చేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా చిల్డ్రెన్స్ స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్మెంట్ ప్రాజెక్ట్ కింద రూ.487.75 లక్షలతో 272 పాఠశాలలకుగాను 568 గదుల నిర్మాణం, కిండర్గార్డెన్ నిర్మించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. శనివారం ఉదయం అధికారులతో కలిసి కలెక్టర్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజవేలు, బీడీఓ మురళీ, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జీకే.వాసన్ జన్మదిన వేడుకలు



మైలాపూర్‌లోని డయాలసిస్ సెంటర్‌లో రోగులకు సహాయాలు అందజేస్తున్న ధనపాలన్, జీఆర్ వెంకటేశన్ తదితరులు

ప్యారీస్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తమిళమానిల కాంగ్రెస్(టీఎంసీ) అధ్యక్షుడు, రాజసభ సభ్యుడు జీకే.వాసన్ 60వ జన్మదిన వేడుకలను శనివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వాసన్ ఆయురారోగ్యాలతో ఉండాలని కాంక్షిస్తూ టీఎంసీ మహిళా విభాగంలో వడపళని సుబ్రమణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శక్తివడివేలు, ప్రధాన కార్యదర్శి తిరువేంగడం, జిల్లా అధ్యక్షుడు ఈకే.అరుణ్‌కుమార్, నందిని, కళ్యాణి తదితరులు స్వర్ణరథం లాగారు. అలాగే మైలాపూర్‌లోని డయాలసిస్ సెంటర్‌లో రోగులకు టీఎంసీ ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేశన్, రోటరీ జిల్లా గవర్నర్ ధనపాలన్, అరిమా గవర్నర్ మురుగేశన్, రవి తదితరులు రోగులకు పండ్లు, ఇతర సహాయాలను అందజేశారు.

పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో రౌడీలకు గాయాలు

పెరంబూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసుల నుంచి తప్పించుకొనేందుకు వంతెనపై నుంచి దూకిన రౌడీల కాళ్లు, చేతులు విరిగాయి. స్థానిక కొడుంగైయూర్ ప్రాంతంలో రాత్రి వేళ గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు కొడుంగైయూర్ సీఐ శరవణన్‌కు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో శుక్రవారం ముల్లైనగర్ వంతెన సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు.ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు మరో వ్యక్తి నుంచి గంజాయి తీసుకోవడం పోలీసులు గమనించారు. అంతలో పోలీసులను గమనించిన ఇద్దరు వంతెన పైనుంచి కిందకు దూకడంతో ఒకరికి చేయి, మరొకరికి కాలు విరిగాయి. పోలీసులు వారిని వెంటనే స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో ఒకరు వ్యాసర్పాడి శర్మా నగర్‌కు చెందిన భువనేశ్వరన్ అలియాస్ ముకేష్ (22) అని, మడిపాక్కంలో డీఎంకే నేత హత్య, సెంబియం ప్రాంతంలో మరో వ్యక్తి హత్యకేసు, మరో 10 కేసుల్లో నిందితుడని తెలిసింది. అలాగే, మరొకరు తండయార్‌పేట కరుణానిధి వీధికి చెందిన మోహనసుందరం (31) అని, అతనిపై 21 దోపిడీ కేసులున్నట్లు గుర్తించారు. మోహనసుందరం ఆంధ్రా నుంచి గంజాయి తీసుకొచ్చి భువనేశ్వర్‌కు అందజేస్తుంటాడని తెలిసింది. ఆస్పత్రిలో వారికి చికిత్స చేసిన అనంతరం కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'కవికో' పురస్కారాల ప్రదానం



పురస్కారం అందజేస్తున్న వీఐటీ వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్తువాచేరిలోకి ఆడిటోరియంలో కవికో ట్రస్ట్ తరపున 'కవికో' పురస్కారాల ప్రదానం జరిగింది. కార్యక్రమానికి ట్రస్ట్ కోశాధికారి సోలైనాథన్ అధ్యక్షత వహించగా, ప్రముఖ కవులు అబ్దుల్ ఖాదర్, ఏర్వాడి రాధాకృష్ణన్ సహ పలువురు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీఐటీ వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, 2023వ సంవత్సరానికి కవి కవితైపిత్తన్‌కు 'కవికో' పురస్కారం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఎన్నికలు డబ్బున్నవారికే అన్నట్లుగా ఉన్నాయన్నారు. 7,100 భాషల్లో తమిళం గొప్పదని, కానీ, హిందీ భాషను బలవంతంగా రుద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన విమర్శించారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):ప్రత్యేకరైళ్ల సేవలు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటనవిడుదల చేసింది.

- నెం.7695 సికింద్రాబాద్-రామనాథపురం ప్రత్యేక రైలు (బుధవారం) జనవరి 1 నుంచి మార్చి 26వ తేది వరకు, నెం.07696 రామనాథపురం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (శుక్రవారం) జనవరి 3 నుంచి మార్చి 28వ తేది వరకు పొడిగింపు.
- నెం.07191 కాచిగూడ-మదురై స్పెషల్ (సోమవారం) జనవరి 6 నుంచి మార్చి 31వ తేది వరకు, నెం.07192 మదురై-కాచిగూడ స్పెషల్ (బుధవారం) జనవరి 8 నుంచి ఏప్రిల్ 2వ తేది వరకు పొడిగింపు
- నెం.07189 నాందేడ్-ఈరోడ్ స్పెషల్ (శుక్రవారం) జనవరి 3 నుంచి మార్చి 28వ తేది వరకు, నెం.07190 ఈరోడ్-నాందేడ్ స్పెషల్ (ఆదివారం) జనవరి 5 నుంచి మార్చి 30వ తేది వరకు పొడిగింపు
- నెం.07435 కాచిగూడ-నాగర్‌కోయిల్ స్పెషల్(శుక్రవారం)జనవరి3నుంచి మార్చి28వతేది వరకు, నెం.07436 నాగర్‌కోయిల్-కాచిగూడ స్పెషల్ (ఆదివారం) జనవరి 5 నుంచి మార్చి 30వ తేది వరకు పొడిగింపు
- నెం.07601 సికింద్రాబాద్-విల్లుపురం స్పెషల్ (గురువారం) జనవరి 2 నుంచి మార్చి 27వ తేది వరకు, నెం.07602 విల్లుపురం-సికింద్రాబాద్ స్పెషల్ (శుక్రవారం) జనవరి 3 నుంచి మార్చి 28వ తేది వరకు పొడిగింపు. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

మేల్‌మరువత్తూర్‌లో వైగై ఎక్స్‌ప్రెస్ హాల్ట్

ఇరుముడి, తైపూసం వేడుకల సందర్భంగా నెం.12635 చెన్నై ఎగ్మూర్-మదురై వైగై ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 11వ తేది వరకు మేల్‌మరువత్తూర్ రైల్వేస్టేషన్‌లో రెండు నిముషాలు ఆగి వెళ్లనుంది.

మందుల షాప్‌లో ఇంజక్షన్

● విద్యార్థి మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మందుల దుకాణంలో ఇంజక్షన్ వేసుకున్న విద్యార్థి మృతిచెందిన ఘటన కలకలం రేపింది. తాంబరం సమీపం సేలయూర్‌లో ఉన్న ఓ మందుల దుకాణంలో విద్యార్థి సంతోష్ (18) ఘటన జరిగిన రోజున ఇంక్షన్ వేయించుకున్నట్లు సమాచారం. ఇంజక్షన్ వేసిన ప్రాంతంలో నొప్పి ఎక్కువ కావడంతో సంతోష్‌ను రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక ఆ యువకుడు మృతిచెందాడు. సంతోష్ మృతికి మందుల దుకాణంలో వేసుకున్న ఇంజక్షన్ కారణమంటూ మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు.

వాకింగ్‌కు వెళ్లిన యువతిపై లైంగిక వేధింపులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్లిన యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లా గంగాపరమేశ్వరి నగర్‌లో కార్పొరేషన్ పార్క్‌లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రజలు వాకింగ్ చేస్తుంటారు.ఈనెల 24వ తేది ఉదయం ఈ పార్క్‌లో 24 ఏళ్ల యువతి వాకింగ్ చేస్తున్న సమయంలో, ఓ యువకుడు అసభ్య పదజాలంతో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.ఈ విషయమై బాధిత యువతి తండ్రి పుదుకోట మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, ఒట్టపిడారం సమీపం వెస్ట్ కలమేడుకు చెందిన కరుప్పస్వామి కుమారుడు తెన్‌మలై తెన్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.

థియేటర్‌పై బాంబు దాడి

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలిలోని మేళపాళయంలో 'అమరన్' సినిమా ప్రదర్శితమౌతున్న ఓ సినిమా థియేటర్‌పై ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు బాంబు దాడి జరిపిన ఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ఆ థియేటర్‌పై ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున కొంత మంది పెట్రో బాంబులతో దాడిచేయగా, అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. థియేటర్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అనంతరం దర్యాప్తు చేపట్టి దాడికి పాల్పడిన మహ్మద్ యూసఫ్ రజీన్(31), మహ్మద్ బుఖారీ(29) అనే ఇద్దరిని అరెస్టు చేశారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, థియేటర్‌పై బాంబు దాడికి పాల్పడిన వారిలో కొంతమంది అజ్ఞాతంలోకి వెళ్లారని వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో అరెస్ట్ చేసిన ఇద్దరికి ఉగ్రవాద సంస్థలతో ఏమైన సంబంధం ఉందా? అనే కోణంలో కూడా విచారణ జరుపుతామని, అవసరమైతే అనుమానితుల ఇళ్లలో యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ద్వారా తనిఖీలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా విధ్వంస చర్యలకు పాల్పడుతున్న వారు మళ్లీ ఇలాంటి దురాఘతాలకు పాల్పడకుండా చట్టపరంగా ఘటిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో ర్యాగింగ్

● ఐదుగురు విద్యార్థుల సస్పెన్షన్

పుదుచ్చేరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ర్యాగింగ్ చేసిన ఐదుగురు విద్యార్థులు సస్పెండ్ అయ్యారు. వివరాల్లోకి వెళితే... గోరిమేడులోని మహాత్మాగాంధీ ప్రభుత్వ దంత వైద్యకళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ఇటీవల ముగిశాయి. గత వారం కళాశాల హాస్టల్‌లో ఉంటున్న మొదటి సంవత్సరం విద్యార్థుల గదులకు వచ్చిన సీనియర్లు వారిని ర్యాగింగ్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బాధిత విద్యార్థుల ఫిర్యాదు మేరకు కళాశాల యాజమాన్యం విచారణ జరిపి, ర్యాగింగ్ జరిగిందని నిర్ధారణ కావడంతో, ర్యాగింగ్‌కు పాల్పడిన ఐదుగురు సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేస్తూ శుక్రవారం కళాశాల యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది.

ఎస్ఐ ఇంటికే కన్నం..!

ఐసిఎఫ్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఇంటికే కన్నం వేసిన వైనం కడలూర్ జిల్లా ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కడలూర్ జిల్లా శెమ్మండలం ప్రాంతానికి చెందిన సెంథిల్‌కుమార్ నెల్లికుప్పం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సెంథిల్‌కుమార్ విధులకు వెళ్లగా అతడి కుమారుడు రాఘవ అభిషేక్ సాయంత్రం ఇంటికి తాళం వేసి దగ్గరలో ఉన్న కడలూర్ దేవనంపట్టి బీచ్‌కు వెళ్లాడు. రాత్రి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన సెంథిల్‌కుమార్ ఇంటి తాళం పగులగొట్టివుండటం చూసి షాక్‌కి గురైయ్యాడు. లోపలికి వెళ్లిచూడగా బీరువా తెరిచి అందులోవున్న చీరలు, వస్తువులు చెల్లాచెదురుగా పడివున్నాయి. లాకర్లో ఉన్న సుమారు కిలో వెండి , కొంత బంగారం నగలు, కొంత నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మత్స్యకారుడిపై కత్తితో దాడి

ఐసిఎఫ్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుడిపై కత్తితో దాడి జరిగిన ఘటన ఎన్నూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలిలా... స్థానిక ఎన్నూర్ వీఓసీ నగర్‌కు చెందిన హరివాళగన్ అనే మత్స్యకారుడిగా నివశిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన ఇంటి దగ్గరలో ఉన్న టీ దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా అదే ప్రాంతానికి చెందిన ఉదయ్‌కుమార్ అనే యువకుడు కత్తితో దాడి చేసి పారిపోయాడు. తలకు తీవ్ర గాయాలపాలైన హరివాళగన్‌ను భార్య జ్యోతి, కుటుంబీకులు చికిత్స నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దాడిచేసిన యువకుడి కోసం గాలిస్తున్నారు.

నీటమునిగి ముగ్గురి మృతి

పెరంబూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాలో నీటమునిగి ముగ్గురు మృతిచెందిన ఘటన విషాదం నింపింది. ఉత్తిరమేరూరు సమీపం వెంగచ్చేరి చెక్‌డ్యాం వద్దకు శనివారం పద్మ (55), వినిత (9), దీపక్ (45) తదితరులు వెళ్లారు. వారు చెక్‌డ్యాంలో స్నానం చేస్తూ నీటమునిగారు. చుట్టుపక్కల వారిచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది చెక్‌డ్యాంలో గాలించి ముగ్గురి మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుడి ఆలయంలో శనివారం అమావాస్య ప్రదోషం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ నంది విగ్రహానికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం



దక్షిణ భారత నడిగర్ సంఘం మాజీ అధ్యక్షుడు, దివంగత డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ మొదటి వర్ధంతి సందర్భంగా చెన్నై, టి.నగర్‌లోని నడిగర్ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆ సంఘ ఉపాధ్యక్షులు పూచి ఎస్.మురుగన్, కార్యవర్గ సభ్యులు హేమచంద్రన్, వాసుదేవన్ తదితరులు

జయాపజయాలు.. విడాకులు.. వివాహ బంధాలు


పెళ్లిపీటలెక్కిన తారలు..

ఈ యేడాది పలువురు సినీ తారలు పెళ్ళిపీటలెక్కారు. ఇందులో హీరోలతో పాటు హీరోయిన్లు, సహాయ నటులు కూడా ఉన్నారు. వీరిలో కొన్నేళ్ళుగా బ్యాచిలర్ జీవితాన్ని అనుభవిస్తూ వచ్చిన పలువురు నటులు వివాహం చేసుకుని సంసార జీవితం లోకి అడుగుపెట్టారు. ఇలాంటివారిలో హీరో సిద్ధార్థ్, నటుడు ప్రేమ్‌జీ అమరన్, వరలక్ష్మి శరత్ కుమార్, కీర్తిసురేష్ ఇలా అనేక మంది ఉన్నారు. వీరి వివరాలను పరిశీలిస్తే..



కీర్తి సురేష్ - ఆంటోనీ తట్టిల్..

ప్రముఖ హీరోయిన్ కీర్తి సురేష్... 15 యేళ్ళపాటు ప్రేమించిన వ్యక్తిని ఈ నెల 12వ తేదీన గోవాలో పెళ్ళి చేసుకున్నారు.



సిద్ధార్థ్ - అదితిరావ్..

చిత్రపరిశ్రమలో మోస్ట్ బ్యాచిలర్ హీరో అయిన సిద్ధార్థ్ ఎట్టకేలకు ఓ ఇంటివాడయ్యారు. ఆయన హీరోయిన్ అదితి రావును పెళ్ళి చేసుకుని తెలంగాణకు అల్లుడయ్యారు. సెప్టెంబరు 16న వీరి వివాహం జరిగింది.



మేఘా ఆకాష్ - సాయి విష్ణు..

కార్తీక్ సుబ్బురాజ్ దర్శకత్వంలో 2019లో వచ్చిన 'పేట' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన మేఘా ఆకాష్.. నటుడు సాయి విష్ణును ప్రేమించి సెప్టెంబరు 15న వివాహం చేసుకున్నారు.



వరలక్ష్మి - నికోలస్..

సీనియర్ నటుడు శరత్ కుమార్ కుమార్తె వరలక్ష్మి ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను పెళ్ళాడారు. వీరి వివాహం జూలై నెల 2వ తేదీ థాయ్‌లాండ్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.



ఉమాపతి - ఐశ్వర్య..

సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె ఐశ్వర్య, సీనియర్ నటుడు తంబి రామయ్య కుమారుడు ఉమాపతి పెద్దల అంగీకారంతో ఓ ఇంటివారయ్యారు. వీరి వివాహం జూన్ 10వ తేదీ జరిగింది.



కాళిదాస్ జయరాం - ధారణి..

ప్రముఖ నటుడు జయరాం కుమారుడు కాళిదాస్ మోడల్ ధారణి కళింగరాయర్‌ను ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని ఈ నెల 8వ తేదీన గోవాలో జరిపించారు.

మీతా రఘునాథ్ - మణికంఠన్..


'ముదల్ నీ ముడివుం నీ' చిత్రంతో వెండితెరకు పరిచయమైన మీతా రఘునాథ్, 'గుడ్ నైట్' దర్శకుడు మణికంఠన్‌ను వివాహం చేసుకున్నారు. వీరిద్దరి వివాహం మార్చి నెల 17వ తేదీ జరిగింది. అలాగే, స్వాసిక - ప్రేమ్ జాకబ్ జనవరి 24న మూడుముళ్ళ బంధంతో ఒక్కటయ్యారు. ఎంతో కాలంగా బ్యాచిలర్ లైఫ్‌ను ఎంజాయ్ చేసిన నటుడు ప్రేమ్‌జీ అమరన్ ఇందు అనే యువతిని జూన్ 9వ తేదీన వివాహం చేసుకున్నారు.



ఏఆర్ రెహ్మాన్ - సైరా బాను



జీవీ ప్రకాష్ - సైంధవి



ధనుష్ - ఐశ్వర్య



జయం రవి - ఆర్తి రవి

వైవాహిక బంధానికి స్వస్తి...

వైవాహిక బంధానికి స్వస్తి చెప్పిన సినీ ప్రముఖుల్లో ప్రముఖ సంగీత దర్శకులు ఏఆర్ రెహ్మాన్, జీవీ ప్రకాష్ కుమార్ ఉన్నారు. హీరోల్లో ధనుష్, జయం రవి, దర్శకుల్లో శీను రామస్వామి ఉన్నారు. రెహ్మాన్‌తో తెగదెంపులు చేసుకుంటున్నట్టు ఆయన భార్య సైరా భాను ప్రకటించారు. అలాగే, తన భార్య, గాయని సైంధవితో వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నట్టు జీవీ ప్రకాష్ కుమార్ ప్రకటించారు. హీరో ధనుష్ - ఐశ్వర్య విడిపోతున్నట్టు రెండేళ్ళ క్రితం ప్రకటించగా, వీరికి ఇటీవల మద్రాస్ ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. మరో హీరో జయం రవి తన భార్య ఆర్తి రవికి విడాకులు ఇస్తున్నట్టు ప్రకటించారు. ప్రముఖ దర్శకుడు శీను రామస్వామి కూడా తన సతీమణి నుంచి తెగదెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. ఇలాగే, మరికొంతమంది సినీ ప్రముఖులు తమ వివాహ బంధానికి అర్థాంతరంగా ముగింపు పలికారు.

భౌతికంగా దూరమైనవారు..

తమిళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సీనియర్ నటీనటులు భౌతికంగా దూరమయ్యారు. ఇలాంటి వాటిలో వెటర్న్ నటుడు ఢిల్లీ గణేష్, నటుడు, దర్శకుడు జి.మారిముత్తు, నటుడు ప్రదీప్ కె.విజయన్, నిర్మాత మోహన్ నటరాజన్, సినీ దర్శకుడు ఎస్‌డి. సభ, ప్రముఖ సినీ నేపథ్యగాయని, భవధారిణి తదితరులు ఉన్నారు.



మారిముత్తు - ఢిల్లీ గణేశ్ (ఫైల్‌ఫొటోలు)



2024 కోలీవుడ్ రివ్యూ...

చరిత్రపుటల్లో మరో సంవత్సరం కలిసిపోనుంది. ఈ యేడాదిలో జరిగిన అనేక చేదు, తీపి జ్ఞాపకాల సమ్మేళనం మదిని నిలువనీయనంటోంది. తమిళ చలన చిత్రపరిశ్రమకు మాత్రం ఈ యేడాది ఆశాజనకంగా లేదని కోలీవుడ్ టాక్. భారీ బడ్జెట్, అంచనాలతో విడుదలైన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తాకొట్టాయి. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన చిన్న సినిమాలు మాత్రం నిర్మాతలకు కనకవర్షం కురిపించాయి. 2024లో 230 చిత్రాలు విడుదలకాగా, వీటిలో చేతి వేళ్ళపై లెక్కించదగిన సంఖ్యలోనే విజయం సాధించాయి. వీటిలో అగ్రహీరో విజయ్ నటించిన 'ది గోట్' మూవీ అత్యధిక కలెక్షన్లతో మొదటి స్థానంలో ఉండగా, భారీ అంచనాలతో విడుదలైన 'కంగువా' డిజాస్టర్‌గా నిలిచింది. అనేక మంది నటీనటులు, టెక్నీషియన్లతో పాటు దర్శకులు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఈ యంగ్ డైరెక్టర్లలో కొందరు తమ తొలి చిత్రంతోనే సత్తా చాటారు. అదేవిధంగా అనేక వివాదాలు చోటుచేసుకోగా, పలువురు సీనియర్ నటులు భౌతికంగా దూరమయ్యారు. పలువురు సినీ ప్రముఖులు తమ వైవాహిక బంధానికి ముగింపు పలికారు. మరికొంత మంది నటీనటులు మూడుముళ్ళ బంధంతో ఒక్కటయ్యారు. అలాగే, నటుడు ధనుష్ - హీరోయిన్ నయనతార మధ్య చెలరేగిన వివాదం కోర్టు వరకు దారితీసింది. అగ్రనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం పార్టీ మహానాడు ఘనంగా నిర్వహించి సఫలీకృతులయ్యారు. ఇలా ఈ యేడాదిలో చోటు చేసుకున్న కొన్ని ఆసక్తికర సంఘటనలను పరిశీలిస్తే...

- అడయార్, ఆంధ్రజ్యోతి



'ది గోట్'లో విజయ్

'మహారాజ'లో విజయ్ సేతుపతి

'అమరన్'లో శివకార్తికేయన్ - సాయిపల్లవి

'ఇండియన్-2'లో కమల్ హాసన్ - 'వేట్టయన్'లో రజనీకాంత్

వరల్డ్ వైడ్‌గా అత్యధిక వసూళ్ళు సాధించిన టాప్-10 మూవీస్

తమిళ చిత్రపరిశ్రమలో ఈ యేడాది సుమారుగా 230 వరకు సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో అనేక చిన్న, భారీ బడ్జెట్ చిత్రాలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఆశించిన స్థాయిలో అంచనాలు అందుకోగా, మరికొన్ని నిరాశపరిచాయి. కోలీవుడ్ ట్రేడ్ వర్గాల సమాచారం మేరకు ఈ యేడాది ప్రపంచ స్థాయిలో అత్యధిక వసూళ్ళను సాధించిన టాప్-10 చిత్రాలను పరిశీలిస్తే.. 'ది గోట్', 'అమరన్', 'వేట్టయన్', 'మహారాజ', 'రాయన్', 'ఇండియన్-2', 'కంగువా', 'అరణ్మనై-4', 'అయలాన్', 'కెప్టెన్ మిల్లర్' కనిపిస్తాయి.

అభిమానులను నిరుత్సాహపరిచిన చిత్రాలు...

2024 ప్రారంభంలోనే తమిళ చిత్రపరిశ్రమ మరోస్థాయికి వెళుతుందని ప్రతి ఒక్కరూ భావించారు. కానీ, వాస్తవంగా అది కార్యరూపం దాల్చలేదు సరికదా.. తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. భారీ అంచనాలు పెట్టుకున్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు రాబట్టలేక బోల్తాకొట్టాయి. వసూళ్ళపరంగా 2023తో పోలిస్తే 2024 తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పొచ్చు.

'అయలాన్, కెప్టెన్ మిల్లర్'..

ఈ యేడాది ఆరంభంలోనే సంక్రాంతికి ఈ రెండు చిత్రాలు విడుదలయ్యాయి. శివకార్తికేయన్ 'అయలాన్' ఎన్నో సమస్యలు, అనుమానాల మధ్య విడుదలై, చివరకు ప్రేక్షకులను నిరాశకు గురిచేసింది. ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' పీరియడ్ ఫిల్మ్‌గా తమకు తోచిన విధంగా తెరకెక్కించడంతో ఫ్లాప్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

'లాల్ సలామ్'...

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రత్యేక పాత్రలో కనిపించిన 'లాల్ సలామ్'ను రజనీ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహించారు. రజనీకాంత్ గెస్ట్ అప్పీరెన్స్ అంటూ ప్రచారం చేసినప్పటికీ సినిమా మొత్తం ఆయన సన్నివేశాలే ఉన్నాయి. అయినప్పటికీ ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

'సింగపూర్ సలూన్, సొర్గవాసల్'...

'ఎల్‌కేజీ, మూక్కుత్తి అమ్మన్' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన ఆర్‌జే బాలాజీ హీరోగా నటించిన 'సింగపూర్ సలూన్', 'సొర్గవాసల్' చిత్రాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి.

'సైరన్, బ్రదర్'...

జయం రవి హీరోగా నటించిన ఈ రెండు చిత్రాలను భారీ బడ్జెట్‌తో నిర్మించి విస్తృత ప్రచారాన్ని కల్పించారు. కథల ఎంపికలో హీరో తడబాటుకు గురవుతున్నారనే విషయాన్ని ఈ రెండు చిత్రాల ఎంపికలోనే తేటతెల్లమైంది. దీంతో గత ఐదేళ్ళ సరైన హిట్ కోసం జయం రవి పరితపిస్తున్నారు.



'కంగువా'లో సూర్య - బాబీ డియోల్

నష్టాలు మిగిల్చిన ఆ రెండు చిత్రాలు...

అగ్ర నటులు కమల్ హాసన్, సూర్య నటించిన 'ఇండియన్-2' 'కంగువా' చిత్రాలపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. కానీ, ఈ రెండు చిత్రాలు విడుదలైన తొలి ఆటలోనే నెగెటివ్ ప్రచారాన్ని మూటగట్టుకుని బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఫలితంగా నిర్మాతలు భారీ నష్టాలను చవిచూశారు.

కలెక్షన్ల పరంగా ఓకేగానీ..

సూపర్‌స్టార్ రజనీకాంత్, చియాన్ విక్రమ్‌లు హీరోలుగా నటించిన 'వేట్టయాన్', 'తంగలాన్' చిత్రాలపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. స్టార్ డైరెక్టర్లు దర్శకత్వం వహించడం, స్టార్ హీరోలు నటించడంతో ఈ రెండు మూవీలు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలుస్తాయని భావించారు. కానీ, ప్రేక్షకులు ఆశించిన స్థాయిలో ఈ సినిమాలు సక్సెస్ సాధించలేకపోయాయి. అయితే, కలెక్షన్ల పరంగా నిర్మాతలను గట్టెక్కించాయి. రజనీకాత్ 'వేట్టయన్' రూ.200 కోట్లు, విక్రమ్ 'తంగలాన్' రూ.100 కోట్లకుపైగా వసూళ్ళను రాబట్టాయి. దీంతో నిర్మాతలు ఊపిరి పీల్చుకున్నారు.



'బ్లడీ బెగ్గర్'లో కవిన్

నిరాశపరిచిన మరికొన్ని చిత్రాలు..

సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ హీరోగా నటించిన 'రెబెల్', 'కల్వన్', 'డియర్' చిత్రాలు డిజాస్టర్ మూవీల జాబితాలో నిలిచాయి. అలాగే, విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'రోమియో', 'మళై పిడిక్కాద మనిదన్', 'హిట్లర్', హిప్‌హాప్ తమిళ కథానాయకుడుగా నటించిన 'పీటీ సార్', 'కడైసి ఉలగ పోర్', కవిన్ నటించిన 'బ్లడీ బెగ్గర్' చిత్రాలు ఉన్నాయి.



'పుష్ప-2'లో అల్లు అర్జున్ - 'లక్కీ భాస్కర్'లో దుల్కర్ సల్మాన్ - మీనాక్షి చౌదరి

వసూళ్ళ వర్షం కురిపించిన డబ్బింగ్ చిత్రాలు..

ఈ యేడాది స్ట్రైట్ తమిళ చిత్రాల కంటే డబ్బింగ్ చిత్రాలు భారీ కలెక్షన్లు రాబట్టాయి. ముఖ్యంగా తెలుగు, మలయాళ చిత్రాలు నిర్మాతలకు కనకవర్షం కురిపించాయి. వీటిలో మలయాళ చిత్రం 'మంజుమల్ బాయిస్', తెలుగు సినిమాలు 'లక్కీ భాస్కర్', 'పుష్ప-2' ఉన్నాయి. 'మంజుమల్ బాయిస్' తమిళ డబ్బింగ్ చిత్రమే ఏకంగా రూ.50 కోట్లకు పైగా వసూళ్ళు సాధించినట్టు సినీ ట్రేడ్ వర్గాల సమాచారం. అలాగే దుల్కర్ సల్మాన్ నటించిన 'లక్కీ భాస్కర్', అల్లు అర్జున్ నటించిన 'పుష్ప-2' మూవీలు కూడా నిర్మాతలకు కాసులపంట పండించాయి. హాలీవుడ్ చిత్రాలు తమిళ ప్రేక్షకులను తీవ్ర నిరాశకు లోనుచేశాయి. విడుదలైన హాలీవుడ్ చిత్రాల్లో ఏ ఒక్క చిత్రం కూడా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను అలరించలేకపోయాయి.

టాప్-10 చిత్రాలు...

ఇతర చిత్రపరిశ్రమలతో తమిళ సినిమాను పోల్చుతూ విమర్శలు గుప్పిస్తూ వచ్చిన వారికి చెంప ఛెళ్ళుమనిపించలేలా ఈ యేడాది నిలిచింది. డిసెంబరు 27వ తేదీ వరకు విడుదలైన చిత్రాల్లో 50కి పైగా మంచి కథా చిత్రాలున్నాయి. ముఖ్యంగా మానవ సంబంధాలు, కుటుంబ విలువలు, భావోద్వేగాలతో వచ్చిన అనేక చిత్రాలు ప్రేక్షకులను ఆలరించాయి. ఇలాంటి చిత్రాల్లో టాప్-10 బెస్ట్ మూవీలను పరిశీలిస్తే...

మెయ్యళగన్... : రక్త సంబంధాలు వదులుకోవడం ఇష్టం లేక పుట్టిన ఊరికి వెళ్లి, తాను పుట్టి పెరిగిన ఇంటిని, అక్కడి బంధువులు, బంధుత్వాలకు హాస్యం జోడించి తెరకెక్కించింది. కార్తీ, అరవింద్ స్వామి నటించిన ఈ చిత్రాన్ని ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహించగా సూర్య, జ్యోతిక కలిసి నిర్మించారు.

జమా... : తన వ్యక్తిగత జీవితంలో స్త్రీ పాత్రలను పోషించే ఒక వీధి కళాకారుడు, బాహ్య ప్రపంచంతో పాటు అంతర్గతంగా ఎదుర్కొనే సమస్యల ఇతివృత్తంతో తెరకెక్కించారు. పరి ఇళవళగన్ దర్శకత్వం వహించారు. ఇందులో ప్రధాన పాత్రను కూడా దర్శకుడే పోషించి శెభాష్ అనిపించుకున్నారు.

వాళై... : దర్శకుడు మారి సెల్వరాజ్ నుంచి వచ్చిన మరో అద్భుత చిత్రం. తాను స్వయంగా అనుభవించిన పేదరికాన్ని వెండితెరపై ఆవిష్కరించగా, ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. తన స్కూల్ బాల్యాన్ని, వయసుకు మించిన భారంగా మారంగా మారిన పేదరికాన్ని అరటి పండు కూడా తినే హక్కులేని దీనస్థితిని ప్రేక్షకులకు కళ్ళకుకట్టినట్టు చూపించిన దర్శకుడు సృజనాత్మకకు అద్దంపట్టింది. దర్శకుడు మారి సెల్వరాజ్ సొంతంగా నిర్మించారు.

రసవాది... : మనం కోల్పోయిన సిద్ధ వైద్యం, వర్మ కళ వంటి అంశాలను ప్రధానంగా చేసుకుని తెరకెక్కించారు. ఇందులోని సన్నివేశాలను దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. అర్జున్ దాస్, తాన్య రవిచంద్రన్, రేష్మ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించగా, శాంతకుమార్ దర్శకత్వం వహించారు.

నందన్... : 'మన దేశానికి రాష్ట్రపతి ఎవరైనా కావొచ్చు.. కానీ, మన ఊరికి మన కులస్థుడే పంచాయతీ అధ్యక్షుడిగా రావాలి' అనే డైలాగుతో ప్రారంభమయ్యే ఈ సినిమా ప్రేక్షకుడిని రెండు గంటల పాటు థియేటర్‌లో కూర్చొనేలా చేసింది. షెడ్యూల్ కులాలకు రిజర్వు చేసిన గ్రామ పంచాయతీలలో అగ్రకులాల ఆధిపత్యాన్ని కళ్ళకుకట్టినట్టు వివరించారు. శశికుమార్, శృతి పెరియస్వామి జంటగా నటించగా, ఈరా శరవణన్ దర్శకత్వం వహించారు.

ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసిన మూవీలు

ఈ యేడాది విడుదలైన చిత్రాల్లో ఉత్తమ సినిమాలు, ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక వసూళ్ళు రాబట్టిన టాప్-10 మూవీస్ మాత్రమేకాకుండా, ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసిన సినిమాలు కూడా ఉన్నాయి. కాన్సెప్ట్, ప్రొడక్షన్, క్రియేటివిటీ పరంగా అభిమానుల ఆదరణ, విమర్శకుల ప్రశంసలు అందుకున్న చిత్రాల్లో 'బ్లూస్టార్'2, 'తంగలాన్', 'జే బేబీ', 'కోళిపన్నై చెల్లదురై', 'అంజామై', 'హాట్‌స్పాట్', 'పరారీ', 'కన్ని', 'వెప్పం కులిర్ మళై', 'సాలా', 'దోనిమా', వంటి చిత్రాలున్నాయి. 'హాట్‌స్పాట్', 'అధర్మ కథైగల్' చెప్పుకోదగిన అంథాలజీ సినిమాలుగా పేర్కొనవచ్చు. పూర్తిస్థాయి వినోదాత్మక సినిమాల జాబితాలో 'అయలాన్', 'హిట్లర్', 'వేట్టయన్' సినిమాలను పేర్కొనవచ్చు. బెస్ట్ స్క్రీన్‌ప్లే చిత్రాల జాబితాలో 'భయమరియ బ్రహ్మై', 'పేచ్చి', 'బ్లాక్' వంటి చిత్రాలుండగా, క్రీడా నేపథ్యంతో వచ్చిన చిత్రాల్లో 'లబ్బర్ పందు', 'సింగపెన్నే' మూవీలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు, యుక్తవయసు ప్రేక్షకులను ఆలరించిన సినిమాలుగా 'కురంగు పెడల్', 'బుజ్జి అట్ అనుపట్టి', 'సెవప్పి', 'మిన్మిణి', 'నల్లపేరు వాంగవేడుం పిళ్ళైగలే', 'టీన్స్' చిత్రాలు ఉన్నాయి. 2024లో వచ్చిన ప్రయోగాత్మక చిత్రాల్లో 'కొట్టుకాళి', 'కడైసి ఉలగపోర్', 'రాకెట్ డ్రైవర్' సినిమాలను పేర్కొనవచ్చు.



'హిట్లర్'లో విజయ్ ఆంటోనీ - 'లబ్బర్ పందు'లో దినేష్ - హరీష్ కళ్యాణ్

2024లో ఆణిముత్యాలు

యేటా వందలాది చిత్రాలు విడుదలవుతుంటాయి. ఎంతో మంది కొత్త దర్శకులు, నటీనటులు, టెక్నీషియన్లు వెండితెరకు పరిచయమవుతూ, తమ ప్రతిభను నిరూపించుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటారు. ఇలాంటి వారిలో అతి కొద్దిమంది మాత్రమే సక్సెస్ అవుతుంటారు. దర్శకత్వం, సంగీతం, హీరో, హీరోయిన్, కథ విభాగాల్లో 2024 ఆణిముత్యాలుగా గుర్తింపు పొందిన వారి వివరాలను పరిశీలిద్దాం.

తమిళరసన్ పచ్చముత్తు (దర్శకత్వం)...



తమిళరసన్ పచ్చముత్తు

ఎప్పటిలాగే 2024లో అనేక మంది కొత్త దర్శకులు తమిళ చిత్రపరిశ్రమకు పరిచయమయ్యారు. వీరిలో ప్రతి ఒక్కరి మనసులు గెలుచుకున్న నూతన దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు. ఒక నాణ్యమైన చిత్రానికి స్టార్ రేంజ్ అక్కర్లేదని నిరూపించారు. హరీష్ కళ్యాణ్, సంజనా కృష్ణమూర్తి, అట్టకత్తి దినేష్, స్వాసికలను ప్రధాన పాత్రధారులుగా చేసి ఆయన తెరకెక్కించిన 'లబ్బర్ పందు' చిత్రం సూపర్‌హిట్ సాధించడంతో పాటు ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేశారు.

జీవీ ప్రకాష్ కుమార్ (సంగీతం)...

2006లో వచ్చిన 'వెయిల్' చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన ఈ సంగీత దర్శకుడు కమ్ హీరో తన సినీ ప్రస్థానాన్ని అప్రహతికంగా కొనసాగిస్తున్నారు. గత 18 యేళ్ళ కాలంలో ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు సంగీతం అందించారు. ఇపుడు తన వందో చిత్రానికి సంగీతం స్వరాలు సమకూర్చే పనిలో నిమగ్నమైవున్నారు. అయితే, ఈ యేడాది 'కెప్టెన్ మిల్లర్', 'మిషన్ చాప్టర్-1', 'సైరన్', 'రెబల్', 'కల్వన్', 'డియర్', 'తంగలాన్', 'అమరన్' వంటి చిత్రాలకు సంగీతం అందించారు. వీటిలో 'అమరన్' చిత్రానికి అందించిన సంగీత హైలెట్‌గా నిలిచింది. చిత్రంలోని ఎమోషనల్ సన్నివేశాల సమయంలో జీవీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చిత్రాన్ని మరోస్థాయికి తీసుకెళ్ళింది. నటుడుగా ఒక వైపు రాణిస్తూనే తన అద్భుతమైన సంగీత మేథసుతో ఎన్నో చిత్రాలకు మంచి సంగీతం అందిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు.

విజయ్ సేతుపతి (హీరో)...

2018లో వచ్చిన '96' అనే మూవీ తర్వాత విజయ్ సేతుపతి నటించిన అనేక చిత్రాలు వాణిజ్యపరంగా నిరాశపరిచాయి. హీరోగా కూడా నిలదొక్కుకోలేకపోయారు. దీంతో తన పంథా మార్చుకుని 'మాస్టర్', 'విక్రమ్' వంటి చిత్రాలతో మరో నట విశ్వరూపాన్ని (విలన్) చూపించారు. అప్పటి నుంచి విజయ్ సేతుపతికి తిరుగులేకుండా పోయింది. అదేసమయంలో తనకు నచ్చిన కథా చిత్రాల్లో హీరోగా నటిస్తున్నారు. అలాంటి చిత్రమే 'మహారాజ'. ఈ చిత్రం విజయ్ సేతుపతి విజయదాహాన్ని తీర్చిందని చెప్పొచ్చు. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఏకంగా రూ.వందల కోట్లను వసూలు చేసింది.

సూరి (కథానాయకుడు)...



తమిళ చిత్రపరిశ్రమలో సహాయ నటుడిగా పరిచయమై, కొన్ని చిత్రాల్లో ఒకే ఒక్క సీన్‌లో కనిపించి, ఆ తర్వాత హాస్య నటుడిగా తన సత్తా చాటిన నటుడు సూరి. 'విడుదలై-1' మూవీతో హీరోగా మారారు. ఈ యేడాది సూరి కథలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నటించిన చిత్రానికి మంచి ఉదాహరణ 'కొట్టుకాళి'. అలాగే, 'గరుడన్', 'విడుదలై-2' సినిమాలు కూడా సూరి నటనకు అద్దంపట్టాయి. హాస్య నటుడు హీరోగా మారిన తర్వాత మూస ధోరణిలో పాత్రలను ఎంచుకోకుండా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చే కథా పాత్రలను ఎంచుకుంటూ ముందుకుసాగుతున్నారు.

సాయిపల్లవి (హీరోయిన్)...

తమిళ భాష బాగా తెలిసిన, బాగా మాట్లాడగలిన హీరోయిన్లకు కోలీవుడ్ బాసటగా నిలబడదు. పరభాషా చిత్రాలకు చెందిన హీరోయిన్లకు మాత్రమే పెద్దపీట వేస్తుంది. అదే పరిస్థితి తమిళనాడు రాష్ట్రానికి చెందిన సాయిపల్లవికి ఎదురైంది. కోలీవుడ్‌లో మినహా తెలుగు, మలయాళ బాషల్లో అగ్ర స్థాయికి చేరుకున్నారు. ఆమెలోని టాలెంట్‌ను ఏ ఒక్క కోలీవుడ్ దర్శకుడు సరిగా ఉపయోగించుకోలేక పోయారన్న విమర్శ ఉంది. ఈ లోటు 'అమరన్' చిత్రంతో పోయిందని చెప్పాలి. ఈ చిత్రంలో చివరి అర్ధగంట సాయిపల్లవి నటనకు తమకు తెలియకుండానే ప్రేక్షకుల కళ్ళు చెమర్చాయి.





'మాస్ క్లీనింగ్ - శ్రమ్‌దాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం రాజ్‌భవన్‌లో పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ ఆర్ఎన్ రవి

తిరునల్లార్ శనీశ్వరుడి సేవలో మనో

ప్యారీస్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రం కారైక్కాల్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన తిరునల్లార్ శనీశ్వరాలయంలో శనివారం ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు మనో కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. కారైక్కాల్‌లోని దర్భారణ్యేశ్వర ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన మనో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహా హారతి అనంతరం శనీశ్వరుడిపై మనో శ్రావ్యంగా భక్తి పాటలు ఆలపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న ఏనుగుకు చెరుకు గడలు, అరటి పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గాయకులు మనోకు ఘన స్వాగతం పలికారు.



కీర్తన ఆలపిస్తున్న గాయకుడు మనో

శ్రీహరి దర్శనానికి 17 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 17 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లలో,నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,715

తలనీలాలు సమర్పించినవారు: 24,503



ఎస్కేపీసీలో ఫేస్ పెయింటింగ్‌తో కొత్త సంవత్సరానికి ఆహ్వానం



ఫేస్ పెయింటింగ్‌తో ఎస్కేపీసీ కళాశాల విద్యార్థినుల సందడి



ప్యారీస్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని ఆహ్వానం పలుకుతూ జార్జ్‌టౌన్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరీ మహిళా కళాశాల(ఎస్కేపీసీ) విద్యార్థినులు ఫేస్ పెయింటింగ్‌తో సందడి చేశారు. శనివారం ఉదయం కళాశాల ప్రాంగణంలో 2025 నూతన సంవత్సరానికి ఉత్సాహంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పలు రకాల సందేశాలను వివరాస్తు చేసిన ఫేస్ పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో ప్రధానంగా నీటిని పొదుపు చేయాలని, పక్షులను రక్షించాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల, మొక్కలు నాటాలని, ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు రంగురంగుల పెయింటింగులతో కనువిందు చేశారు. కొత్త సంవత్సరంలో విద్యార్థినులు సరికొత్త ఆశయాలతో ముందుకెళ్లాలని కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మోహన్‌శ్రీ, తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ మైథిలి సూచించారు.

రాధాత్రి నేత్రాలయ ఆధ్వర్యంలో పురస్కారాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాధాత్రి నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్య చికిత్సల్లో పేరొందిన వైద్యులకు పురస్కారాలు అందజేశారు. టి.నగర్‌లోని జీఆర్టీ గ్రాండ్ హోటల్‌లో ఇటీవల రాధాత్రి నేత్రాలయం 16వ వార్షికోత్సవంలో భాగంగా 'రాడనెట్ 2024' పేరుతో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాధాత్రి నేత్రాలయం మెడికల్ డైరెక్టర్ డా.ప్రవీణ్ కృష్ణ మాట్లాడుతూ.. క్యాటరాక్ట్ చికిత్సలో వస్తున్న ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నామన్నారు. కంటి వైద్య చికిత్సలో రాధాత్రి నేత్రాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా కంటి వైద్య చికిత్సల్లో పేరొందిన అరవింద ఐ కేర్ సిస్టమ్ ఛైర్మెన్ డా.నాచియార్, శ్రీరామ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ డైరెక్టర్ అఖిల శ్రీనివాసన్‌లకు పురస్కారాల్లో భాగంగా గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాలను రాధాత్రి నేత్రాలయం మెడికల్ డైరెక్టర్ల డా.ప్రవీణ్‌కృష్ణ, డా.వసుమతి వేదాంతం అందజేసి అభినందించారు.



పురస్కార గ్రహీలతో డాక్టర్ ప్రవీణ్ కృష్ణ, డాక్టర్ వసుమతి వేదాంతం

నీలగిరి పర్వతాల్లో అంతరించిపోతున్న అరుదైన తహార్ గొర్రెలు

ప్యారీస్, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జంతువుగా గుర్తించిన అరుదైన తహార్ జాతి గొర్రెలు క్రమేనా క్షీణిస్తున్నట్లు రాష్ట్ర అటవీ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. భారత దేశంలోని తమిళనాడు వాయువ్య దిశగా ఉండే అడవులు మొదలుకుని కేరళలోని పడమటి కనుమల వరకు విస్తరించివున్న నీలగిరి పర్వతాల్లో నివసించే తహార్ జాతి గొర్రెలు నీలగిరి జిల్లా ప్రాంతంలోని ముదుమలై టైగర్స్ రిజర్వ్ ఫారెస్ట్‌లో అరుదుగా కనిపిస్తాయి. ఈ తహార్ అనే గొర్రెల జాతి రోజురోజుకి కనుమరుగైపోతున్నట్లు ఇటీవల జరిపిన సర్వేలో తెలిసిందని జిల్లా అటవీ శాఖా అధికారి గణేశన్ తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, ఏప్రిల్ 29న నీలగిరి పర్వతాల్లో నీలగిరి డీలైన్ ప్రాజెక్ట్ అనే వన్యప్రాణుల గణన సర్వే ప్రారంభమై.. దాదాపు ఏడు నెలల పాటు జరిగిందని తెలిపారు. డిసెంబర్ వరకు ముకుర్తి నేషనల్ పార్క్, వెలిమలై, ఆనైమలై ఫారెస్ట్, నీలగిరి జిల్లా, ముదుమలై టైగర్స్ రిజర్వ్ ఫారెస్ట్‌లలో వీటి సంఖ్య 832 ఉండగా, రాష్ట్రం మొత్తంలో 1,031 తహార్ గొర్రెలున్నట్టు సర్వేలో తేలిందన్నారు. 2011లో జరిగిన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 1,863 ఉండే ఈ గొర్రెల జాతి ప్రస్తుతం కనుమరుగౌతోందని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తహార్ గొర్రెల జాతి పూర్తిగా అంతరించిపోయే ప్రమాదముందని గణేశన్ ఆందోళన వ్యక్తం చేశారు.



నీలగిరి పర్వతాల్లోని రాష్ట్ర జంతువైన తహార్ జాతి గొర్రెలు

ఆకట్టుకుంటున్న దారు శిల్పం

వాషర్ మెన్ పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోవైలో వృక్ష శిల్పం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. కోవై-మేట్టుపాళయం రోడ్డు సమీపంలోని చింతామణి రౌండ్ ఠానా ప్రాంతంలో కార్పొరేషన్ పార్క్ రూపొందించింది. ఈ పార్క్‌లో మొక్కల ఆకారంలో విద్యుద్దీపాలు ఏర్పాటుచేశారు. అలాగే, వృక్షంతో రూపొందించిన శిల్పం భుజంపై ప్రపంచ మ్యాప్ ఎత్తుకున్నట్లు రూపొందించారు. మొక్కలు నాటడడంపై ప్రజలకు అవగామన కల్పించేలా ఈ పార్క్ రూపొందించినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.



ప్రపంచ మ్యాప్‌ను భుజంపై ఉంచినట్లు కర్రతో రూపొందించిన శిల్పం

అన్నామలై వచ్చే జన్మలోనూ చెప్పులు తొడగలేరు

● మంత్రి శేఖర్‌బాబు యెద్దేవా

చెన్నై, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకూ చెప్పులు వేసుకోనంటూ ప్రగల్భాలు పలుకుతున్న బీజేపీ రాష్ట్ర నేత అన్నామలై ఈ జన్మలోనే కాదు వచ్చే జన్మలోనూ చెప్పులు తొడగలేరని హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు యెద్దేవా చేశారు. చెన్నై ఐలాండ్ గ్రౌండ్స్‌లో శనివారం ఉదయం సీఎండీఏ ఆధ్వర్యంలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో భాగంగా నిర్మించనున్న ఎగ్జిబిషన్ స్టాల్స్‌తో కూడిన భవన సముదాయ ప్రాథమిక స్థాయి పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఐలాండ్ గ్రౌండ్స్‌లో ప్రతియేటా ఎగ్జిబిషన్లు నిర్వహించడం ఆనవాయితీ అని, ప్రస్తుతం ఎగ్జిబిషన్లను శాశ్వత ప్రాతిపదికన నిర్వహించేలా రూ.104 కోటతో ఎగ్జిబిషన్ భవనాన్ని నిర్మించనున్నమని, అందులో ఓపెన్ ఎయిర్ థియేటర్, రెస్టారెంట్లు తదితర సదుపాయాలు కూడా ఉంటాయన్నారు. ఈ భవన సముదాయంలో 40 దుకాణాలు, 200 ద్విచక్రవాహనాలు, 200 నాలుగు చక్రాల వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ కూడా ఏర్పాటవుతుందన్నారు. అన్నా యూనివర్శిటీలో జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ అన్నామలై కొరడాతో కొట్టుకున్న సంఘటనపై ఆయన కామెంట్ చేస్తూ సాధారణంగా కొరడాలు కొబ్బరి నారతో, రబ్బరు దారాలతో తయారై ఉంటాయని, అన్నామలై అలాంటి కొరడాలతో కొట్టుకోకుండా దూదితో తాయరైన కొరడాతో కొట్టుకుని అపహాస్యం పాలయ్యారని, ఇదంతా ప్రచారార్భాటం కోసమేనని విమర్శించారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకూ పాదరక్షలు వేసుకోనని శపథం చేయడంకూడా రాజకీయ స్టంట్ అని, రాష్ట్రంలో ద్రావిడ తరహాల పాలనే యేళ్లతరబడి కొనసాగనుందని, కనుక వచ్చే జన్మలోనూ ఆయన చెప్పులు వేసుకునే పరిస్థితి ఉండదని శేఖర్‌బాబు యెద్దేవా చేశారు. మంత్రితోపాటు సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, సీఈఓ ఎ.శివజ్ఞానం, కార్పొరేషన్ నార్త్ జోన్ డిప్యూటీ కమిషనర్ కట్టా రవితేజా, మండల కమిటీ నాయకుడు శ్రీరాములు, ప్రణాళికాధికారి ఎస్.రుద్రమూర్తి, ఎస్ఈ ఎన్.బాలమురుగన్ తదితరులు పాల్గొన్నారు.



ఐలాండ్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ భవన సముదాయం పనులను పరిశీలిస్తున్న సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు

దానగుణాన్ని అలవరచుకోండి

● హిందూ కళాశాల కార్యదర్శి వెంకటేశ పెరుమాళ్

చెన్నై, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దాన గుణాన్ని అలవరచుకుని తమ శక్తి మేరకు సాటివారికి దానధర్మాలు చేయాలని ధర్మమూర్తి రావ్ బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాల కార్యదర్శి వెంకటేశ పెరుమాళ్ హితవు పలికారు. కళాశాల వ్యవస్థాపకుల్లో ఒకరైన కలవల సీతమ్మ స్మృత్యర్థం నిర్వహించిన వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిథిగా వెంకటేశపెరుమాళ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మమూర్తి కన్నన్ చెట్టి తన చివరి వీలునామా ప్రకారం వారి యావదాస్తిని దానధర్మాల కోసమే వినియోగించాలని చూశారన్నారు. పిల్లలు లేకున్నా సమాజమే వారి సంతానంగా భావించారని, అంత గొప్ప విశాల భావాలున్న వారి కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా విశాల భావాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల సంచాలకులు డాక్టర్ రాజేంద్ర నాయుడు ప్రసంగంలో శతాబ్దం కాలంగా డీఆర్‌బీసీసీ అనే ధార్మిక సంస్థ చేస్తున్న విద్యా దానం ఎనలేనిదని, వారి దానధర్మాలు నిరాటంకంగా సాగుతున్నాయన్నారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కల్విక్కరసి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు, తమిళ, హిందీ, ఆంగ్ల భాషల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆలపించిన భజన, భక్తిగీతాలు అలరించాయి. భక్తిగానంతో ఆకట్టుకున్న విద్యార్థులకు కార్యదర్శి వెంకటేశపెరుమాళ్ ప్రత్యేక నగదు బహుమతులను అందజేశారు.



భక్తిగీతాలు ఆలపించిన విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

12 నుంచి పుదువైలో హెల్మెట్ తప్పనిసరి

● మంత్రి నమశ్శివాయం



పుదుచ్చేరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో జనవరి 12 నుంచి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల్సిందేనని మంత్రి నమశ్శివాయం తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు ఉన్నతాధికారులతో మంత్రి నమశ్శివాయం శుక్రవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... నూతన సంవత్సరం రోజున 2 వేల మంది పోలీసులు, 500 మంది స్వచ్ఛంద కార్యకర్తలు బందోబస్తులో ఉంటారన్నారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. హెల్మెట్ ధారణపై సుప్రీంకోర్టు కొన్ని ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. హెల్మెట్ ధారణపై ప్రజల్లో అవగాహన కల్పించేలా జనవరి 11వ తేది నిర్వహించనున్న భారీ ర్యాలీని ముఖ్యమంత్రి రంగస్వామి ప్రారంభిస్తారని తెలిపారు. మరుసటిరోజు నుంచి ద్విచక్రవాహనదారులు, వాహనం వెనుకగా కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్న నిబంధన అమలుకు వస్తుందని మంత్రి నమశ్శివాయం స్పష్టం చేశారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

రూ.8లక్షల విలువైన బంగారం, వెండి, రెండు ద్విచక్ర వాహనాల స్వాధీనం

యాదమరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8 లక్షల విలువైన బంగారం, వెండి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. యాదమరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఈశ్వర్‌తో కలిసి వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు శనివారం మీడియాకు వివరాలు తెలిపారు. చిత్తూరు జిఅల్ల యాదమరి మండల పరిధిలోని ఎర్రచేనుమిట్టలో ఆగస్టు 22వ తేదీ కొట్టాల రహదారి రోడ్డులోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఇంట్లో ఉంటున్న సురేంద్ర, సుధారాణి దంపతులు బంధువుల వివాహానికి వెళ్లారు. ఆ సమయంలో తాళం పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలోని 144 గ్రాముల బంగారం, వెండి, కొంత నగదును దుండగులు అపహరించుకెళ్లారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అప్పటికే మండలపరిధిలో ఇళ్లు, ఆలయాలే లక్ష్యంగా చోరీలు జరుగుతుండటంతో ఎస్పీ మణికంఠ, వెస్ట్ సీఐ ఆధ్వర్యంలో యాదమరి ఎస్ఐ ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు, పాత నేరస్థుడు తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్టుకు చెందిన ఈశ్వరన్‌ను గత నెలలో అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 47.5 గ్రాముల బంగారం రికవరీ చేశారు. అతడిచ్చిన సమాచారంతో మిగిలిన ఇద్దరినీ ప్రస్తుతం అరెస్టు చేశారు. వీరిద్దరినీ తమిళనాడు రాష్ట్రం అంబూరు తాలూకా ఆర్.పట్టి గ్రామానికి చెందిన విక్రం దేవరాజ్, వరదరామి నల్లాంగనూరుకు చెందిన సెల్వరాజ్ పెరుమాళ్‌గా గుర్తించారు. వీరి నుంచి ఎర్రచేనులో రెండుచోట్ల జరిగిన దొంగతనాలకు సంబంధించి రూ.6.80లక్షల విలువైన 170 గ్రాముల బంగారం, రూ.10వేల విలువైన 107 గ్రాముల వెండి, రెండు ద్విచక్రవాహనాలు మొత్తం రూ.8.10 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిపై బెంగళూరు, వేలూరు తదితర ప్రాంత పోలీసు స్టేషన్ల పరిధిలో కేసులున్నట్లు తేలింది. నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎస్ఐ, సిబ్బందిని సీఐ అభినందించారు.

పక్షుల పండుగను విజయవంతం చేస్తాం

● మత్స్యశాఖ డీడీ నాగరాజు ● పడవ షికారుకు తొలగిన అడ్డంకులు

తడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన పక్షుల పండుగను అధికారులు, మత్స్యకారుల సమన్వయంతో విజయవంతం చేస్తామని మత్స్యశాఖ డీడీ నాగరాజు అన్నారు. శనివారం సాయంత్రం భీములవారిపాళెం పడవల రేవుకు వచ్చిన ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. పర్యాటకశాఖ రిసార్టులో మత్స్యకార నాయకులతో సమావేశమయ్యారు. పడవల బకాయిలు, పడవల ఏర్పాటుపై చర్చించారు. రాబోయే పండుగలో 30 పడవల ఏర్పాటుకు మత్స్యకారులు అంగీకారం తెలిపారని ఆయన మీడియాకు వెల్లడించారు. సమావేశంలో డీడీతోపాటు ఎంపీడీవో విజయకుమార్, మత్స్యకార నాయకులు బొమ్మన పళణి, శ్రీధర్, సుధాకర్, ఏకాంబరం, ప్రకాష్, ఎఫ్‌డీవో మహిజ, ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.



పడవల రేవును పరిశీలిస్తున్న మత్స్యశాఖ డీడీ నాగరాజు తదితరులు

సంద్రాన్ని తలపిస్తున్న వీరాణం జలాశయం



పెరంబూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వీరాణం జలాశయం పూర్తి స్థాయిలో నిండి సముద్రంలా దర్శనమిస్తోంది. కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ సమీపంలో వీరాణం జలాశయం 14 కి.మీ పొడవు, 5 కి.మీ వెడల్పు కలిగి ఉంది. జలాశయం పూర్తి సామర్థ్యం 47.50 అడుగులు కాగా, ఈ జలాశయం ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు లభిస్తోంది. మేట్టూరు డ్యాం నుంచి గత జూన్ నుంచి సాగు కోసం విడుదల చేసిన జలాలు కొల్లిడం, కీలనై వడవారు మీదుగా వీరాణం జలాశయానికి చేరుతున్నాయి. అలాగే, కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జలాశయానికి నీటి రాక పెరిగింది. ఈ క్రమంలో, బుధవారం సాయంత్రం జలాశయం నీటిమట్టం 47.50 అడుగుల పూర్తి సామర్థ్యానికి చేరుకుంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

పెరంబూర్, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): తేని సమీపంలో వ్యాన్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందగా, మరో 18 మందికి గాయాలయ్యాయి. పెరియకుళం సమీపంలోని కాట్రోడు నుంచి తేని మార్గంగా వెళుతున్న కేరళ రాష్ట్రానికి చెందిన కారు, తేని నుంచి ఏర్కాడు వెళ్తున్న వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రగాయాలతో ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న ఒకరిని తేని ప్రభుత్వ వైద్యకళాశాలకు తరలించారు. ఈ ఘటనలో వ్యానులో ప్రయాణిస్తూ గాయపడిన 18 మందిని ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనపై దేవదానంపట్టి పోలీసులు కేసు నమోదుచేసి చేపట్టిన ప్రాథమిక దర్యాప్తులో... మృతులు ముగ్గురు కేరళ రాష్ట్రం కొట్టాయం ప్రాంతానికి చెందిన సెయింట్ థామస్ (43), జోబిన్ థామస్ (34), షాజీ (43)అని, వారు వేలాంకన్ని వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది. అలాగే, వ్యానులో వెళ్తున్న వారు తేనికి చెందిన వారుగా గుర్తించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదానికి గురైన వాహనాలు